నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | శనివారం 27 ఏప్రిల్ 2024 | MAHABUBABAD

వరంగల్‌లో 48, మహబూబాబాద్‌లో 25

రెండు స్థానాల్లో 73 నామినేషన్లకు ఆమోదం

బాబుమోహన్ సహా 15 నామినేషన్లు రిజెక్ట్

వరంగల్, ఏప్రిల్ 26(నమస్తేతెలంగాణ)/మహబూబాబాద్ రూరల్: వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో పది మంది నామినేషన్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. మొత్తం 58లో పది మంది అభ్యర్థుల నామినేషన్లు రిజెక్ట్ అయినట్లు ప్రకటించారు. వీరిలో బీజేపీ నుంచి కొండేటి శ్రీధర్, బీఆర్ఎస్ నుంచి అందె యాకయ్య, స్వతంత్ర అభ్యర్థులు బాబుమోహన్, సురేశ్, శంకర్, కావ్యశ్రీ, సంపత్, కమలాకర్, ప్రభాకర్, ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి లక్ష్మీనారాయణ ఉన్నారు. మిగతా 48 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం తెలిపినట్లు రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య తెలిపారు. ఇందులో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు మారెపల్లి సుధీర్‌కుమార్, అరూరి రమేశ్, కడియం కావ్య ఉన్నారు. మహబూబాబాద్‌లో ఐదుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తం 30 మందిలో ఐదుగురి నామినేషన్లు రిజెక్ట్ కాగా 25 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం తెలిపినట్లు ఆర్వో అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. వీరిలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు మాలోత్ కవిత, సీతారాంనాయక్, బలరాంనాయక్ ఉన్నారు.

గోవిందరావుపేటలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మానుకోట అభ్యర్థి మాలోత్ కవిత

ఢిల్లీలో గళమెత్తేది బీఆర్ఎస్సే

హక్కుల సాధన, సమస్యల పరిష్కారం గులాబీ పార్టీతోనే సాధ్యం

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి : ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య.. కాజీపేటలో జోరుగా ఎన్నికల ప్రచారం

కాజీపేట, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిస్తేనే ఢిల్లీలో తెలంగాణ గళం వినిపిస్తుందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. కాజీపేటలోని డీజిల్ కాలనీ, పోచమ్మ గుడి, కూరగాయల మార్కెట్, ఏఆర్ఆర్‌నగర్, విద్యానగర్, మహంకాళి గుడి, విష్ణుపురి, వైఎస్సార్ నగర్‌లో బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ గెలుపు కోసం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య శుక్రవారం ప్రచారం నిర్వహించారు. వీరికి మైనార్టీలు, మహిళా సంఘాలు, రైల్వే రిటైర్డ్ కార్మికులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ఓటు వేసి మోసపోయామని స్థానికులు వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి తప్పదని ఆ పార్టీ పెద్దలకు భయం పట్టుకుందన్నారు.

కాజీపేటలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార గెలుపు కోసం ప్రచారం చేస్తున్న నాయకులు

కాజీపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

అవినీతిపరులు-ఉద్యమకారులకు మధ్య ఎన్నికలు

దాస్యం వినయ్‌భాస్కర్

ఇవి అవినీతిపరులకు, ఉద్యమకారులకు మధ్య జరుగుతున్న ఎన్నికలని, తెలంగాణ ఉద్యమ నాయకుడు కేసీఆర్ బలపరిచిన సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ కోరారు. బాపూజీనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. విభజన చట్టం హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. ప్రజల చిరకాల వాంఛ కోచ్ ఫ్యాక్టరీని సాధించే వరకూ పోరాడుతామన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నాయకులు నార్లగిరి రమేశ్, జనార్దన్ గౌడ్, శిరుమల్ల దశరథం, గబ్బెట శ్రీనివాస్, పాలడుగుల శివకుమార్, నయూం జుబేర్, దువ్వ కనుకరాజు, మర్యాల కృష్ణ, సుంచు అశోక్, అష్జల్, సోనీ, సయ్యద్ సర్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీవి బూటకపు హామీలు

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్

దామెర, ఏప్రిల్ 26 : ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ ఇస్తున్న బూటకపు హామీలను ప్రజలు నమ్మొద్దని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం దామెర మండలం కోగిల్వాయి, వెంకటాపురం, సింగరాజులపల్లి, పులుకుర్తి, ల్యాదెళ్ల, దామెర, ఓగ్లాపూర్, దమ్మన్నపేట, తక్కళ్లపహాడ్, ముస్త్యాలపల్లి, పసరగొండ, ఊరుగొండ, దుర్గంపేట, సీతారాంపురం గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వలేదని, ఉచిత విద్యుత్ కొద్దిమందికే వర్తింపజేసి మోసం చేసిందన్నారు. ఆసరా పెన్షన్లు పెంచి ఇవ్వడం లేదని, ఆడబిడ్డ పెండ్లికి రూ.లక్ష నగదు, తులం బంగారం, రైతుల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. మాయమాటలు చెప్పిన కాంగ్రెస్‌కు ఆడబిడ్డల ఉసురు తగులుతుందని విమర్శించారు. బీజేపీ తెలంగాణకు నిధులను కేటాయించడంలో తీరని అన్యాయం చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ గడ్డపై గులాబీ జెండా ఎగురడం ఖాయమని, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఊరుగొండలో జరిగిన సమావేశంలో మారపెల్లి సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్నివిధాలుగా అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కరెంటు, నీళ్ల కష్టాలు మొదలయ్యాయన్నారు. సమావేశాల్లో ఎంపీపీ కాగితాల శంకర్, జడ్పీటీసీ కల్పన-కృష్ణమూర్తి, వైస్ ఎంపీ పీ జాకీర్‌అలీ, మండలాధ్యక్షుడు గండు రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ముదిగొండ కృష్ణమూర్తి, ఎంపీటీసీలు పోలం కృపాకర్‌రెడ్డి, గోవిందు సంధ్య-అశోక్, సంగనబోయిన మౌనిక-కిరణ్, మండల కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, పీఏసీఎస్ డైరెక్టర్ గుండా చంద్రమోహన్, దాడి మల్లయ్య, గ్రామ అధ్యక్షులు ఎడ్ల గోపాల్, బత్తిని రాజు, హింగె శ్రీనివాస్, కునాటి సునీల్‌రెడ్డి, చెల్పూరి చంద్రయ్య, కిన్నెర రమేశ్, చిలివేరు రాజు, మేకల సంపత్, జక్కుల రాణీరవీందర్ పాల్గొన్నారు.


ఊరుగొండలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్

గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

రుణమాఫీపై మళ్లీ మోసానికి సీఎం రేవంత్ కుట్ర

కాంగ్రెస్ వాళ్లు ఓట్లు అడిగితే ప్రజలు తరిమికొడ్తరు

బీఆర్ఎస్ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాలోత్ కవిత

గోవిందరావురావు, మంగపేటలో ఎన్నికల సన్నాహక సమావేశాలు

గోవిందరావుపేట/మంగపేట, ఏప్రిల్ 26: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. గోవిందరావుపేట మండల కేంద్రంలోని కమ్మ సంఘం ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు, మంగపేట మండలం రాజుపేటలో పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా అభ్యర్థి కవిత మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ మోసపూరిత ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దేవుళ్ల మీద ఒట్లు వేస్తూ ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రైతులను మరోసారి మోసం చేయాలని కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఐదెకరాలున్న రైతులకు ఇంకా రైతుబంధు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఓట్లు అడిగేందుకు వస్తే ప్రజలు తరిమి కొడుతారన్నారు. కేసీఆర్ పాలనలో మండు వేసవిలోనూ జలాశయాలు నిండుకుండలా ఉంటే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో చుక్కనీరు లేక ఎండిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కవితను మరోసారి ఎంపీగా గెలిపిద్దాం : జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించుకునేందుకు సమష్టిగా కృషి చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి కోరారు. బీఆర్ఎస్ పాలనలో ములుగు జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని, మళ్లీ ఎంపీగా కవితను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటామన్నారు. కవితను ఎంపీగా గెలిపించాలన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవిందనాయక్, పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, జిల్లా నాయకుడు కాకులమర్రి ప్రదీప్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మల్లూరు గుడి చైర్మన్ ముకుందం, పీఏసీఎస్ డైరెక్టర్ సిద్ధంశెట్టి లక్ష్మణ్ రావు, మండల ఉపాధ్యక్షుడు యడ్లపల్లి నర్సింహారావు, గ్రామ అధ్యక్షుడు చదలవాడ సాంబశివ రావు, కొమరం ధనలక్ష్మి, కుర్బాన్‌అలీ, కర్రీ శ్యాంబాబు, మలికంట శంకర్, చిట్టిమల్ల సమ్మయ్య, పూజారి శ్రీను, యర్రంగాని మోహన్ రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరణంలోనూ తోడుగా..

భార్య మృతిని తట్టుకోలేక భర్త మృత్యువాత

24గంటల్లోపే ఇద్దరి మృతితో ఆత్మకూరులో విషాదఛాయలు

ఆత్మకూరు, ఏప్రిల్ 26 : భార్య మృతిని తట్టుకోలేక భర్త 24గంటల్లోపే మృతి చెందిన ఘటన శుక్రవారం ఆత్మకూరులో జరిగింది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పొగాకుల సుగుణమ్మ(70) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. కాగా, ఆమె భర్త చేరాలు(80) ఆరేళ్ల నుంచి అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో భార్య మృతిచెందిన విషయం తెలియగానే తట్టుకోలేక అతడూ తనువు చాలించాడు. అన్యోన్యంగా ఉండే ఆ దంపతుల మరణంతో బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు.

చేరాలు, సుగుణ(ఫైల్)

యజమాని ఇంటికే కన్నం

ప్రియుడు, అక్కతో కలిసి బంగారు ఆభరణాలు చోరీ చేసిన పనిమనిషి

ముగ్గురు నిందితుల అరెస్ట్.. 470 గ్రాముల గోల్డ్, కారు స్వాధీనం

సీపీ అంబర్ కిశోర్ ఝా వెల్లడి

సుబేదారి, ఏప్రిల్ 26 : ప్రియుడు, అక్కతో కలిసి ఓ పనిమనిషి యజమాని ఇంటికే కన్నం వేసి పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లింది. యజమాని ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. శుక్రవారం హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన కత్రి కల్యాణి రంగశాయిపేటలో నివాసముంటూ సంతోష్‌నగర్‌లోని డాక్టర్ కీసర విక్రమ్‌రెడ్డి ఇంట్లో పని మనిషిగా పని చేస్తున్నది. ఈ క్రమంలో విక్రమ్‌రెడ్డి ఇంట్లో పెద్దమొత్తంలో బంగారు ఆభరణాలు ఉన్నట్లు తెలుసుకొని, చోరీకి పక్కా ప్లాన్ వేసింది. నెక్కొండ మండలం చందుగొండ గొల్లపల్లికి చెందిన ప్రియుడు మూడు చంటి(ఆటో డ్రైవర్), హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్‌కు చెందిన ఆమె అక్క మౌర్య సునీతతో కలిసి విక్రమ్‌రెడ్డి ఇంట్లో నాలుగు దఫాల్లో 650 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేసింది. ఇందులో కొంత విక్రయించి కారు కొనుగోలు చేసింది. బంగారు ఆభరణాలు మిస్సైనట్లు గుర్తించిన విక్రమ్‌రెడ్డి సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ సత్యనారాయణరెడ్డి, సిబ్బంది విచారణ చేపట్టి చోరీ చేసిన ముగ్గురిని గుర్తించారు. శుక్రవారం సుబేదారి ఫారెస్ట్ ఆఫీస్ వద్ద సీఐ వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో ఉన్న నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకోగా చోరీ చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి 470 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణరెడ్డి, ఏఎస్సై రాజయ్య, పర్వీన్, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, అలీ, ప్రభాకర్, ఇతర సిబ్బందిని సీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

స్వాధీనం చేసుకున్న గోల్డ్ వైన్లను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

స్వాధీనం చేసుకున్న కారు

కాంగ్రెస్‌లో గ్రూప్ వార్

సీఎం రేవంత్‌రెడ్డి సభ రోజే తన్నులాట

54వ డివిజన్ నాయకుడు నిఖిల్‌పై డివిజన్ ప్రెసిడెంట్ ప్రదీప్ వర్గం దాడి

కేయూ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

ప్రదీప్ వర్గం దాడిలో తీవ్రంగా గాయపడిన నిఖిల్

సుబేదారి, ఏప్రిల్ 26 : కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ వార్ నడుస్తున్నది. 54వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు చింత నిఖిల్‌పై అదే డివిజన్‌కు చెందిన మరో వర్గం దాడికి పాల్పడింది. ఈ దాడిలో నిఖిల్ తలకు గాయాలు కావడంతో ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కేయూసీ సీఐ సంజీవ్ కథనం ప్రకారం.. ఈ నెల 24న మడికొండలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు హనుమకొండ పోచమ్మకుంట నుంచి వాహనాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని నిఖిల్ 54డివిజన్ ప్రెసిడెంట్ కూడుక ప్రదీప్‌ను అడిగారు. అయితే సభ ముగిసిన తర్వాత రాత్రి ప్రదీప్ నిఖిల్‌ను మాట్లాడుకుందామని పెగడపల్లి డబ్బాలు జంక్షన్ సమీపంలోకి పిలిపించాడు. ఈ క్రమంలో నిఖిల్‌పై ప్రదీప్, అతడి అనుచరులు నవీన్, సందీప్ మరికొంత మంది దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదుతో ప్రదీప్, అతడి అనుచరులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

3న మడికొండకు ప్రధాని మోదీ

మడికొండ, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చే నెల 3న మడికొండకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్నారు. ఈ మేరకు బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని బీజేపీ శ్రేణులు శుక్రవారం పరిశీలించారు. అంతకుముందు ఖిలా వరంగల్‌లోని మైదానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్, పార్లమెంట్ క్లస్టర్ ఇన్‌చార్జి, రాష్ట్ర క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు, పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవి, పార్లమెంట్ ప్రభారీ మురళీధర్‌గౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కీర్తి రెడ్డి, కేశవరెడ్డి, కుమారస్వామి, నాయకులు పొనగోటి వెంకట్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, నాయకుడు బొల్లికొండ వినోద్ పాల్గొన్నారు.

సభాస్థలిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

దేవరుప్పులలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

వరంగల్‌లో మరోసారి గులాబీ జెండా ఎగురవేస్తాం

కడియం శ్రీహరి చరిత్రహీనుడిగా మిగులుతారు

పాలకుర్తి నియోజకవర్గంలో మార్పు చూపిస్తా

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్‌లో మరోసారి గులాబీ జెండా ఎగురవేస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా దేవరుప్పులలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ నేత కేసీఆర్ పాలన స్వర్ణయుగాన్ని తలపించిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు. ఓవైపు సాగునీరందక పంటలు ఎండిపోయాయని, ధాన్యం కొనుగోళ్లు లేక రైతులు ఇబ్బందిపడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి హామీ నెరవేరలేదని మహాలక్ష్మి పథకంలో పేద మహిళలకు నెలకు రూ. 2500 చొప్పున ఇస్తామని చెప్పి మోసం చేశారని ఎర్రబెల్లి మండిపడ్డారు. కనీసం కర్షకులకు రైతుబంధు సాయం అందలేదని, రూ.2లక్షల రుణమాఫీపై అనేక వాయిదాలు పెడుతున్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి రైతులను మభ్యపెట్టేందుకు ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ప్రమాణాలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఘన విజయం చేకూరుస్తారని ఎర్రబెల్లి తెలిపారు.

శ్రీహరిపై వ్యతిరేకతతో కావ్య ఓటమి ఖాయం

కారు గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని ఎర్రబెల్లి విమర్శించారు. పదేళ్లలో బీఆర్ఎస్‌లో ఎన్నో పదవులు అనుభవించిన శ్రీహరికి ఉద్యమ నేత కేసీఆర్ ఎంతగానో గౌరవం ఇస్తే మోసం చేశాడని అన్నారు. కడియం కావ్యకు కాంగ్రెస్‌లో ఆదరణ లేకపోగా, శ్రీహరి చేసిన నమ్మకద్రోహానికి ఆ కుటుంబంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఇదే ఆమె ఓటమికి కారణమవుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను చూసి ప్రజలు నమ్మారని, కానీ నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ మోసాలను గమనించారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో తమ ఓటుతో తీర్పు ఇస్తారని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, చింత రవి, కొల్లూరు సోమయ్య, కారుపోతుల భిక్షపతి, ధరావత్ రాంసింగ్ పాల్గొన్నారు.

రూ.24.77లక్షల నగదు సీజ్

మానుకోట జిల్లాల్లో వేర్వేరు చోట్ల పట్టివేత

కేసముద్రం/కురవి/డోర్నకల్/బయ్యారం, ఏప్రిల్26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద రూ. 24.77 లక్షల నగదును పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసముద్రానికి చెందిన హరి నెకొండ్కకు రూ.18 లక్షల నగదును తీసుకెళ్తుండగా కేసముద్రం మండలం కోరుకొండపల్లి స్టేజీ వద్ద పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. కురవి మండలం నేరడ శివారు బాల్యతండాకు చెందిన వ్యక్తి రూ.3.50లక్షల నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు కురవి ఎస్సై గోపీ తెలిపారు. డోర్నకల్ ఎస్సీ బీసీకాలనీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఖమ్మం జిల్లా మంచుకొండకు చెందిన వినోద్ సహానీ నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు సిబ్బంది తెలిపారు. ముల్కలపల్లికి చెందిన బోడ సాయికుమార్ ఖమ్మం నుంచి బొలెరో వాహనంలో తీసుకొస్తున్న రూ.52వేలను సీజ్ చేశారు. ఇల్లెందు, మహబూబాబాద్ జాతీయ రహదారిపై గార్ల, బయ్యారం సరిహద్దు సత్యనారాయణపురం క్రాస్‌రోడ్డు వద్ద ఐపీఎస్ ట్రైనీ బయ్యారం ఎస్‌హెచ్‌వో చేతన్‌నితిన్, సీఐ రవికుమార్ నేతృత్వంలో ఎస్సైలు మౌలానా, జీనత్ వాహన తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో వ్యాపారులు బరిగల ప్రేమ్‌కుమార్ రూ.75వేలు, శివలింగయ్య నుంచి రూ.లక్ష నగదు సీజ్ చేశారు.

కేసముద్రంలో స్వాధీనం చేసుకున్న నగదును చూపిస్తున్న ఎస్సై వంశీధర్